ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 29 మే 2025



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



టీడీపీ అధినేత చంద్రబాబుతో అశోక్‌గజపతిరాజు



మహానాడు వేదికపై మంత్రి శ్రీనివాస్

సందడిగా ఎన్టీఆర్ జయంతి

- ఆకట్టుకున్న ఏకపాత్రాభినయ ప్రదర్శనలు, ఫొటో గ్యాలరీ

విజయనగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ 102వ జయంతి ఉత్సవాలు విజయనగరం కలెక్టరేట్‌లో బుధవారం సందడిగా సాగాయి. ప్రభుత్వం అధికారికంగా చేపట్టడంతో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. తెలుగుజాతికి గౌరవం, గుర్తింపు తెచ్చిన తెలుగుజాతి కీర్తి కిరీటం దివంగత మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ, నందమూరి తారకరామారావు అని అధికారులు, అభిమానులు కీర్తించారు. ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రముఖ రంగస్థల నటుడు కందుల గుణేశ్వరావు శ్రీకృష్ణుడిగా, నంది అవార్డు గ్రహీత ముళ్లపూడి రామచంద్రరావు ధుర్యోదనుడిగా ఏకపాత్రాభినయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మయసభ ఘట్టం కళాభిమానులను కట్టిపడేసింది. నంది అవార్డు గ్రహీత మురళీ హార్మోనియా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే విధంగా ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన ఫొటో గ్యాలరీని ప్రతి ఒక్కరూ ఆసక్తిగా తిలకించారు. మహారాజా ప్రభుత్వ నృత్య కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్ కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి గొప్పతనాన్ని, గౌరవాన్ని ప్రపంచ స్థాయికి చేర్చిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని అన్నారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, డీఆర్వో మురళి, సీపీవో బాలజీ, సోషల్ వెల్ఫేర్ డీడీ బోని రామానందం, బీశెట్టి బాబ్జీ, సాహితీవేత్త నాలుగుఎస్‌ల రాజు తదితరులు పాల్గొన్నారు.



ధుర్యోదనుడి పాత్రలో ముళ్లపూడి రామచంద్రరావు



శ్రీకృష్ణుడిగా ఏకపాత్రాభినయం చేస్తున్న కందుల గుణేశ్వరావు





నెల్లిమర్లలో కలకలం

- అక్రమ నీటి కనెక్షన్ల గుట్టు రట్టు
- కొత్త కమిషనర్ విచారణతో వెలుగులోకి
- ఇప్పటికే 267 కనెక్షన్ల గుర్తింపు
- సుమారు రూ.21 లక్షల ఆదాయానికి గండి

నెల్లిమర్ల, మే 28(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో అక్రమ నీటి కుళాయి కనెక్షన్ల గుట్టు రట్టయింది. గృహ సంబంధ నీటి కుళాయి కనెక్షన్లపై వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ తారక్‌నాథ్ సీరియస్‌గా తీసుకున్నారు. విచారణకు ఆదేశించడంతో పెద్ద దందాయే వెలుగు చూసింది. ఇద్దరు అసిస్టెంట్ ఇంజినీర్లు, 11 మంది సిబ్బందిని బృందాలుగా నియమించి విచారణ చేయించారు. ఇప్పటివరకు 267 నీటి కుళాయి కనెక్షన్‌లు అక్రమమని తేల్చారు. ఇంకా విచారణ సాగుతోంది. నగర పంచాయతీ నెల్లిమర్ల, జరజాపుపేటల్లో సుమారు 400 వరకు ఈ తరహా అక్రమ కనెక్షన్‌లు ఉండవచ్చని భావిస్తున్నారు.

నెల్లిమర్ల నగర పంచాయతీలో అందరికీ తాగునీరు అందేలా గతంలో ప్రతివీధిలోనూ పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశారు. నీటి వనరులను బట్టి ఆ కుళాయిల ద్వారా ఉదయం గాని, సాయంత్రం గాని ఏదో ఒక పూట గంట నుంచి రెండు గంటల వరకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాగా అదనంగా డిపాజిట్ చెల్లించిన వారి ఇళ్లకు తాగునీటి కనెక్షన్‌లు ఇవ్వాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. ఈ విధంగా (మిగతా 6వ పేజీలో..)

సిబ్బంది ప్రమేయం ఉంటే చర్యలు తప్పవు

పబ్లిక్ కుళాయిల ద్వారా తాగు నీటి సదుపాయాన్ని ఎవరైనా పొందవచ్చు. అయితే సొంత ఇంటి కుళాయిలు కావాల్సిన వారు రూ.11 వేలను నగర పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుంది.చెల్లించకుండానే కొంతమంది కుళాయి కనెక్షన్ పొందారు. వీటిపై విచారణ చేపట్టాం. సిబ్బంది ప్రమేయం ఉంటే చర్యలు తప్పవు.

- ఎ.తారక్‌నాథ్, కమిషనర్



అక్రమ కుళాయిలను బంద్ చేస్తున్న సిబ్బంది

అన్నదాతకు ఆసరా

- ధాన్యానికి కనీస మద్దతు ధర పెంపు
- క్వింటా వద్ద రూ.69 అదనం
- జిల్లా రైతాంగానికి రూ.38కోట్ల50లక్షల లబ్ధి

విజయనగరం మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించింది. క్యాబినెట్ బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. కీలక పంట వరి క్వింటాపై రూ.69 పెంచింది. అలాగే జొన్న క్వింటాకు రూ.328, రాగులకు రూ.596, వేరుశనగకు రూ.480, మొక్కజొన్నకు రూ.175, కందిపప్పుకు రూ.450, మినుములకు రూ.400, పొద్దుతిరుగుడు రూ.441, పత్తి రూ.589 పెంచినట్టు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవి వెల్లడించారు. ఇతర పంటలతో పోల్చితే.. ధాన్యానికి కనీస మద్దతు ధర చాలా తక్కువని రైతులు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో 97 వేల హెక్టార్లలో వరి సాగులో ఉండగా గత ఏడాది ఖరీఫ్‌లో 5లక్షల 26 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి క్వింటా రూ.2,300కు కొనుగోలు చేయగా, ఈసారి ఖరీఫ్‌లో రూ.2,369కు కొనుగోలు చేస్తారు. జిల్లాలో రైతులు వరి పండించే విస్తీర్ణాన్ని బట్టి ఈసారి రైతాంగానికి అన్నిరకాలుగా అనుకూలిస్తే రూ.38కోట్ల50లక్షల వరకు అదనంగా లబ్ధి చేకూరనుంది. రానున్న ఖరీఫ్ సీజన్‌లో 80కేజీల వరి బస్తా రూ.1,895లకు కొనుగోలు చేయనున్నారు. సాగులో పెట్టుబడులకు, వచ్చే ఆదాయానికి (మిగతా 6వ పేజీలో..)

జిల్లాలో ఖరీఫ్‌లో వరి పండించే విస్తీర్ణం	: 97వేల హెక్టార్లు
గత ఖరీఫ్‌లో పండిన ధాన్యం	: 5లక్షల26వేల మెట్రిక్ టన్నులు
గత ఖరీఫ్‌లో క్వింటా బస్తా రేటు	: రూ.2,300
ఈసారి కేంద్రం క్వింటా వరికి పెంచిన మద్దతు ధర	: రూ.69





గుండె చెరువు

భోగాపురం, మే28(ఆంధ్రజ్యోతి): పంటకు సాగునీరు.. పశుపక్ష్యాదులకు తాగునీరు.. ఎన్నో తరాల ప్రజలకు ఆహ్లాదం అందిస్తూ వచ్చిన ఆ చెరువును నేడు చూస్తున్న వారి గుండె తరుక్కుపోతోంది. పర్యావరణ సమతుల్యాన్ని కూడా కాపాడిన చెరువును ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలతో నింపేస్తుండడం చూసి ఆవేదన చెందుతున్నారు. అందులో అంతంతమాత్రంగా నీరుండగా అది కూడా కాలుష్యమయం కావడం అటుగా వెళ్లే వారి మనసును తట్టిలేపుతోంది. భోగాపురం గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గంగిరావి చెరువు దుస్థితిది. వ్యర్థాలకు నిలయంగా మారింది. చెరువు పొడవునా ప్లాస్టిక్, మాంసం వ్యర్థాలు, గ్లాసులు, కోళ్ల వ్యర్థాలతో దుర్గంధమయం అయింది. ఈ చెరువు దుస్థితి ఏ అధికారినీ కదిలించడం లేదా అని రోడ్డున వెళ్లేవారు సైతం మథనపడుతున్నారు.



అలకల్లోలం

భోగాపురం, మే28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా సముద్రంఅల్లకల్లోలంగా మారింది. రెండు రోజులుగాకెరటాలు ఉధృతంగా వస్తూ తీరాన్ని తాకుతున్నాయి.ముక్కాంలో సముద్రం ఎత్తు పెరగడంతో పాటు సుమారు 15 అడుగుల వరకు ముందుకొచ్చింది. మత్స్యకారులు తీరంలో ఉంచిన వేట సామగ్రిని గ్రామంలోకి తీసుకొచ్చి భద్రపర్చుకుంటున్నారు.

ఆశ్చర్యపోయిన జేసీ

- చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రించిన వైనం

విజయనగరం రింగురోడ్డు, మే 28(ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలో తీసుకుంటున్న జాగ్రత్తలపై బుధవారం పరిశీలనకు వెళ్లిన జేసీ సేతుమాధవన్ చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రించి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఏకంగా వచ్చే నెల తేదీని ముందుగా ముద్రించేయడం పద్ధతి కదని సున్నితంగా హెచ్చరించారు. నగరంలోని లీలామహల్ థియేటర్‌కు తొలుత వెళ్లారు. పారిశుధ్య నిర్వహణ, తినుబండారాల నాణ్యత.. ధరలు, టిక్కెట్ ధరలు, ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఎన్‌సీఎస్ థియేటర్‌లో పరిశీలించారు. చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ ఉండడంతో విస్తుపోయారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్డీవో సవరమ్మ కూడా ఉన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము విజయనగరంలో థియేటర్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. సౌకర్యాలు, తినుబండారాలు, శీతలపానీయాల నాణ్యత, ధరలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయన్నుట్టు తెలిపారు. కాగా రెండు థియేటర్లలో మాత్రమే తనిఖీలు తూతూమంత్రంగా చేసి వెళ్లిపోయారన్న విమర్శలు వినిపించాయి. తనిఖీల్లో ఇన్‌చార్జి తహసీల్దారు స్వర్ణకుమార్ ఉన్నారు.




చిప్స్ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న జేసీ

వేగంగా వంతెన నిర్మాణం

- వచ్చేనెల చివరి నాటికి మానాపురం ఆర్వోబీ పూర్తయ్యే అవకాశం
- తీరనున్న నాలుగు రాష్ట్రాలు, జిల్లా వాహనదారుల కష్టాలు

విజయనగరం, మే 28(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాలు, నాలుగు రాష్ట్రాల ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్న పెదమానాపురం రైల్వే గేటు గండం నుంచి అతి త్వరలో గట్టెక్కనున్నారు. వచ్చేనెల చివరి నాటికి ఆర్వోబీ పూర్తయ్యే అవకాశం ఉంది. విశాఖ నౌకాశ్రయం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు భారీగా సరుకు రవాణా వాహనాలు ఇదే రహదారిపై ప్రయాణిస్తుంటాయి. లారీలు, బస్సులు, కార్లు, ఇతర వాహనాలూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ నిర్మిస్తున్న రైల్వే వంతెన వచ్చేనెల (జూన్) ఆఖరుకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు కూడా వేగంగానే జరుగుతున్నాయి. విజయనగరం-రాయగడ రైల్వేలైన్‌పై సుమారు రూ.21 కోట్లతో ఆర్వోబీ నిర్మాణం చేపట్టారు. రైల్వే శాఖ తమ వంతుగా లైన్‌పై వంతెన నిర్మాణం పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దానికి ఇరువైపులా రోడ్డు, ఇతరత్రా పనులు చేయాలి. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్ననిర్మాణ సంస్థ మరో సంస్థకు సబ్ లీజుకు ఇవ్వడంతో సుమారు పదేళ్లపాటు పనుల్లో జాప్యం జరిగింది. తెలుగుదేశం పార్టీ హయాంలో పనులు ప్రారంభమైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయక కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఇటీవల జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పనులు వేగవంతం (మిగతా 6వ పేజీలో..)



చురుగ్గా జరుగుతున్న మానాపురం ఆర్వోబీ పనులు

పొలాలను ఇచ్చేది లేదు

- సర్వే అధికారులను అడ్డుకున్న మారిక గిరిజనులు
- కొండదిగి వెళ్లిపోవాల్సిందేనని స్పష్టం

వేపాడ, మే 28 (ఆంధ్రజ్యోతి):'మా పొలాలను ఇచ్చేది లేదు... మాకు ఎటువంటి సర్వేలు, సమావేశాలు పెట్టవద్దు.. అధికారులందరూ కొండదిగి వెంటనే వెళ్లిపోండి' అంటూ మారిక గ్రామ గిరిజనులు ఖరాకండిగా చెప్పారు. తమ మనోభావాలను అర్థం చేసుకోవాలని గిరిజనులందరూ బుధవారం ముక్తకంఠంతో కోరారు. గిరిశిఖర గ్రామంగా గుర్తింపు పొందిన మారిక గ్రామ భూముల్లో అదానీ పవర్ ప్రాజెక్టు వస్తోందని తెలుసుకున్న గిరిజనులు కొన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నారు. వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తూ అధికారులకు విన్నపాలు ఇస్తున్నారు. తమ భూములను తీసుకోవద్దని కోరుతున్నారు. తాజాగా సామాజిక సర్వే పేరుతో అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది పోలీసులతో బుధవారం గ్రామానికి (మిగతా 6వ పేజీలో..)



అధికారులను అడ్డుకుంటున్న మారిక గిరిజనులు

పసుపు జాతర


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం





రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు




మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

వేడుకగా ఎన్టీఆర్ జయంతి

మహా నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతిని ఉమ్మడి జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి..నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


నెల్లిమర్ల: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వనజాక్షి, రవిశేఖర్ తదితరులు


విజయనగరం రూరల్: కోట జంక్షన్‌లో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు


జామి: ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు


గజపతినగరం: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


కొత్తవలసలో...


చీపురుపల్లి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గద్దే బాబూరావు తదితరులు


భోగాపురం: పోలిపల్లిలో..


సీతంపేట రూరల్: ఐటీడీఏలో ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో...


మహానాడు ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే విజయచంద్రతో పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు

మహానాడులో ఉత్సాహంగా..

కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో రెండో రోజు బుధవారం ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ అధినేత చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను అభినందించారు. వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


ఎస్.కోట, బొబ్బిలి ఎమ్మెల్యేలు లలితకుమారి, బేబీనాయన


రాజాం: చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ గ్రీష్మ


ఎస్.కోట: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సుధారాణి


గరివిడి: మంత్రి లోకేష్‌తో రామ్‌మల్లిక్‌నాయుడు


మహానాడులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్


చీపురుపల్లి: ఎమ్మెల్యే కళా వెంకటరావుతో టీడీపీ నాయకులు


రాజాం: మహానాడు వేదిక వద్ద రాజాం టీడీపీ శ్రేణులు

జీర్ణం.. జీర్ణం



- ఆధునిక జీవనశైలితో అజీర్తి సమస్యలు
- జిల్లాలో పెరుగుతున్న గ్యాస్ట్రిక్ బాధితులు
- అప్రమత్తతతోనే సమస్యలకు చెక్
- నేడు వరల్డ్ డైజెస్టివ్ డే

విజయనగరం రింగురోడ్డు, మే 28 (ఆంధ్రజ్యోతి): 'ఈ ప్రపంచంలో అదృష్టవంతు లెవరూ అంటే... తిన్నది సరిగా జీర్ణమయ్యే వారు'.. ఇదీ ఓ తెలుగు సినిమాలోని డైలాగ్. దీన్ని బట్టి జీర్ణానికి ఉన్న ప్రాముఖ్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు చాలా మంది జీర్ణక్రియ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారు. అజీర్తి సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విజయనగరం జిల్లాలోనూ ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. జీర్ణ సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు. జీర్ణక్రియ సంబంధిత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వరల్డ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆర్గనైజేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా మే 29న జీర్ణ ఆరోగ్య దినోత్సవం (వరల్డ్ డైజిస్టివ్ డే)ని నిర్వహిస్తున్నారు.

అజీర్తి సమస్యలకు కారణాలు...

- సాధారణంగా సరిపోని ఆహారపు అలవాట్లు, ఉప్పు, నూనె, పుల్లటి, అధిక మసాలాలతో కూడిన ఆహారాలను తినడం లేదా ప్రాసెస్ చేసి నిల్వ ఉంచిన ఆహారాలు తినడం.
- అతిగా మద్యం తాగడం, ధూమపానం అజీర్తికి దారి తీస్తాయి.
- కాఫీ, టీ, ఇతర శీతలపానీయాలు ఎక్కువగా తాగడం వల్ల అవి గ్యాస్, ఎసిడిటీని పెంచుతాయి.
- నిద్రపోయే ముందు ఎక్కువగా తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది.
- మానసిక ఒత్తిడి జీర్ణ వ్యవస్థ పనితీరును ప్రభావితం చేస్తుంది.
- వ్యాధులకు వాడే యాంటీబయాటిక్స్, నాన్ స్టిరాయిడ్, యాంటీ ఇన్‌ఫ్లామెటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడీఎస్), ఐరన్ సప్లిమెంట్లు అజీర్తిని కలిగించవచ్చును.

లక్షణాలు ఇవే..

సాధారణంగా ఆహారపు అలవాట్ల వల్ల అరుగుదల మందగించి అజీర్తి సమస్య ఉత్పన్నమవుతుంది. చివరకు అల్సర్లు, గాలిబ్లడర్ వంటి సమస్యలు ప్రారంభమవుతాయి. అజీర్తి సమస్య అధికమైతే పొట్టలో మంట, పొత్తి కడుపు నొప్పి, విపరీతంగా పుల్లటి తేన్పులు, వాంతులు వంటివి వస్తాయి.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

జీర్ణ సంబంధిత సమస్యలు దూరం కావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. తీసుకునే ఆహారంలో కచ్చితంగా ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు వంటివి విరివిగా తీసుకోవాలి. యోగా, ధ్యానం వల్ల జీర్ణశక్తి మెరుగవుతుంది. వేపుళ్లు, కారం, ఉప్పు, మసాలాలు దట్టించిన ఆహారాన్ని తగ్గించాలి. మత్తుపదార్థాల వినియోగాన్ని ఆపేయాలి.

– డాక్టర్ ఐ.నరేష్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, విజయనగరం



సులభంగా జీర్ణం కావాలంటే

- ఆహారాన్ని నెమ్మదిగా ఎక్కువ సార్లు నమలడం వల్ల జీర్ణ ఎంజైములు సమర్థవంతంగా పనిచేసి జీర్ణ క్రియ సులభమవుతుంది తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం తగ్గుతుంది.
- పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్‌లు ఉన్న సమతుల ఆహారం, ఫైబర్ కలిగిన ఆహారం వల్ల జీర్ణక్రియ బాగుంటుంది.
- భోజనం చేసిన తరువాత వెంటనే పడుకోకుండా కాసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది.
- పెరుగు వంటి ప్రొ బయోటిక్ ఆహారాలు తినడం వల్ల ప్రేవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి

సెలవులో విజయనగరం ఆర్డీవో

విజయనగరం కలెక్టరేట్, మే28 (ఆంధ్రజ్యోతి) విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి వ్యక్తిగత కారణాలతో 20 రోజులపాటు సెలవు పెట్టారు. ఈనెల 27 నుంచి జూన్ 15 వరకూ ఆమె సెలవులో ఉంటారు. ఇన్‌చార్జి ఆర్డీవో బాధ్యతలను భూసేకరణ యూనిట్-2 ప్రత్యేక ఉప కలెక్టరు టి.సవరమ్మ చేపట్టనున్నారు.

గాలులకు ఎగిరిన రైల్వే ప్లాట్‌ఫాం పైకప్పు



రేకులు ఎగిరిపోయిన దృశ్యం

దత్తిరాజేరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం తెల్లవారుజామున వీచిన గాలులకు కోమటిపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షానికి స్థానికులు భయపడ్డారు.

నేడు 'జిందాల్' నిర్వాసితులతో సమావేశం

శృంగవరపుకోట రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలో గురువారం ఉదయం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిందాల్ నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో న్యాయవాది అల్లు జోగినాయుడు, సీపీఐ నేత కామేశ్వరరావు, సీపీఎం నేత తమ్మినేని సూర్యనారాయణ, రైతు సంఘ నేత చల్లా జగన్ పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

మతోన్మాదంతో దేశానికి ముప్పు

గజపతినగరం, మే28 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదం, ఉగ్రవాదంతో దేశానికి ముప్పు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టి.వి. రమణ అన్నారు. సమైక్యత యాత్రలో భాగంగా బుధవారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.లక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీరులో మన భూభాగంపై మన దేశ పౌరులపై పెహల్గాంలో ఉగ్రవాది దాడి అమానుషమన్నారు. ఆ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, జిల్లా నాయకులు రాముడు, హరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మహానాడుకు నెల్లిమర్ల నాయకులు

నెల్లిమర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నుంచి కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో బయలుదేరిన బస్సుకు పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవి శేఖర్, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, బొంతు వెంకటరమణ, గురాన చక్రధర్, వానపల్లి వీరభద్రరావు, బయిరెడ్డి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటన

నెల్లిమర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ ప్రాంతంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ ఎ.తారక్‌నాథ్ బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య అధికంగా ఉందని వారు తెలియజేయడంతో వెంటనే గాంధీనగర్ కాలనీ వార్డు సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీతో మాట్లాడారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.29.76 లక్షలు

నెల్లిమర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో బుధవారం హుండీలను లెక్కించారు. స్వామివారికి రూ.29,76,730 ఆదాయం లభించింది. 89 రోజులకు గాను బుధవారం హుండీలను తెరిచి లెక్కించినట్టు దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు.

నాగార్జునకు అరుదైన అవకాశం

- మహానాడు రెండోరోజున వ్యాఖ్యాతగా బాధ్యత



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో పండగ వాతావరణంలో జరుగుతున్న మహానాడులో జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు పార్టీ అధినేత చంద్రబాబు సముచిత ప్రాధాన్యం కల్పించారు. బుధవారం జరిగిన కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా అరుదైన బాధ్యతను నాగార్జునకు అప్పగించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకూ సభను నడిపించే అవకాశం నాగార్జునకు దక్కింది. ఈ సమయంలో ఆయన పలు తీర్మానాలను పార్టీ నాయకులతో సభలో ప్రవేశ పెట్టించడమే కాకుండా ఆకట్టుకునే విధంగా ప్రారంభ ఉపన్యాసాన్ని ఇవ్వడంతో మంచి స్పందన లభించింది.

మహిళలకు ప్రత్యేక భవనాలు నిర్మిస్తా



మహిళా సంఘాల సభ్యులతో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో తాను ఎమ్మెల్యేనైతే ప్రతి పంచాయతీలో మహిళల కోసం ప్రత్యేక భవనాలు నిర్మిస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం మండలంలోని బొడ్డవరలో సచివాలయం, రైతు సేవాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం భవానీనగర్‌లో మహిళ సంఘాల కోసం నిర్మించిన గ్రామైక్య సంఘ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్సీతో మాట్లాడారు. ప్రతి పంచాయతీలో మహిళల కోసం భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించారు. పంచాయతీ భవనాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ మీన తదితరులు పాల్గొన్నారు. ● మండలంలోని బొడ్డవర సచివాలయంలో గదిని వినూత్నంగా గిరిజనుడితో ఎమ్మెల్సీ ప్రారంభింపజేశారు. అదే గ్రామానికి చెందిన గిరిజనుడు వల్లభరావు గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు ఉన్నారు.

ఘనంగా పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వేపాడ, మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాదిలో పరదేశమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు, పోతురాజు విగ్రహాలను వేదపండితుడు కిశోర్ సారథ్యంలో సింహచలం దేవస్థానం వేదపండితులు ప్రతిష్ఠోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, సర్పంచ్ కర్రి యశోద, ఉప సర్పంచ్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు తులసి, గొంప వెంకటరావు, గుమ్మడి గణేష్, గుమ్మడి, చప్ప, చలుమూరి కుటుంబాలు పాల్గొన్నారు. దాదాపు రూ.30 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సర్పంచ్ కర్రి యశోద అభ్యర్థన మేరకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ప్రస్తుత జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహకరించారు.

త్వరలో జేవీవీ రాష్ట్ర మహాసభలు

రాజాం, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో త్వరలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేట్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, పిల్లల్లో సృజనాత్మకత, పర్యావరణం, రైతు అంశాలపై ప్రజల్లో జేవీవీ చైతన్యం తీసుకు వస్తోందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడారు. కార్యక్రమంలో వేదిక నాయకులు జె.సీలయ్య, వెంకటనాయుడు, రెడ్డి మోహనరావు, బుద్ధుడు, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడికి చెక్

విజయనగరం రింగురోడ్డు, మే 28 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ ఇందుమా యోగాసనాల విధానాన్ని వివరించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో యోగా విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, నగరపాలక సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వేతనదారులకు నష్టం జరిగితే చర్యలు

- వేతనం పెరగాల్సిందే.. ● కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వేతనదారుల సరాసరి వేతనాలు పెరగకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులపై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు పని దినాలు, కనీస వేతనం రూ.250 పెరగాలన్నారు. వచ్చే వారానికి కల్లా రూ.270 అవ్వాల్సిందేనన్నారు. ఏప్రిల్, మేలో లక్ష్యం కోటి 10 లక్షల 93 వేల పనిదినాలకు గాను 70.23 లక్షల పని దినాలను సృష్టించారన్నారు. ఇది కేవలం 63 శాతం మాత్రమేనన్నారు. తక్కువ పని దినాలు కల్పించిన మండలాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీడీలు వారి పరిధిలోని మండలాలను ప్రతిరోజు తనిఖీ చేయాలన్నారు. పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ ద్వారా చేపడుతున్న బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులపై సమీక్షించారు. సమావేశంలోని డ్వామా పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సత్కారం



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

రేగిడి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉంగరాడ గురుకులానికి చెందిన టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించిన నేపథ్యంలోప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కలెక్టర్ అంబేడ్కర్ అభినందించారు. కలెక్టర్‌తో పాటు సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి ఉన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ సత్కరించారు. అలాగే అత్యధిక మార్కులు సాధించిన లాస రాజేశ్, అలికాన సాయిచరణ్‌లతో పాటు శతశాతం ఉత్తీర్ణతకు కారణమైనఉపాధ్యాయులు శివప్రసాదరావు, మృత్యుంజయ రావులను కలెక్టర్ అభినందించారు.

కౌలు రైతుకు గుర్తింపు కార్డు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం, మే28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు ఉండాలని ఏడీఏ కె.ఎ.మహరాజన్ అన్నారు. బుధవారం మండలంలోని పాతబగ్గాం రైతు సేవాకేంద్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విక్రయం, ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం కలిగే సమయంలో బీమా వర్తిస్తుందన్నారు. గుర్తింపు కార్డు కేవలం 11 నెలలు మాత్రమే కౌలు రైతులకు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో ధనలక్ష్మి, వీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

55 మంది కౌలు రైతుల గుర్తింపు

●రేగిడి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉణుకూరు, పారంపేట, మునకలవలస, అంబాడ గ్రామాల్లో బుధవారం కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. 11 నెలల కాలపరిమితి ఒప్పందంతో ప్రభుత్వం వీరిని గుర్తిస్తున్నట్టు ఏవో మురళీకృష్ణ తెలిపారు. గుర్తింపు కార్డుల ఆధారంగా బ్యాంక్ రుణాలు, విత్తనాలు, ఎరువులు జారీ చేస్తామన్నారు. తొలిరోజు నాలుగు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 55 మంది కౌలు రైతులను గుర్తించామన్నారు. గ్రామ సభల్లో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

శృంగవరపుకోట రూరల్, మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములాపల్లి, మామిడిపల్లి వీఆర్వో చలుమూరి కృష్ణ(48) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సిరిపురపు వీధిలో ఇండియన్ బ్యాంకు ఎదురుగా బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ వివరాల మేరకు.. బొబ్బిలి పట్టణానికి చెందిన ఎం.శ్రీనివాసరావు(46) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం స్థానిక టీచర్స్ కాలనీలో పనిచేసేందుకు తన బైక్‌పై బయలుదేరాడు. ఇండియన్ బ్యాంకు దగ్గరికి వచ్చేసరికి, బొబ్బిలి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి అతడిని ఢీకొంది. దాంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఇందిర, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తహసీల్దారు చెంతకు పంచాయితీ?

- ఇబ్బంది పెట్టద్దు అంటున్న బాధిత విద్యార్థి కుటుంబం
- మెడికల్ కోణంలో సాగని విచారణ
- సెటిల్‌మెంట్‌తో తప్పించుకున్న ఉపాధ్యాయుడు

రేగిడి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు.. విద్యార్థినిపై లైంగిక దాడి గర్భవతిని చేశాడనే ఉదంతంపై వాస్తవాలు బయటపడటంలేదు. విద్యాశాఖ, పోలీస్, రెవెన్యూశాఖలు వారి పరిధిలో అంతర్గత విచారణ చేస్తున్నప్పటికీ ఎలాంటి పురోగతి కలప్పించడంలేదు. అభియోగం ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు వారినీ మేనేజ్ చేశాడనే ప్రచారం జరుగుతోంది. ఇది పరువుకు సంబంధించిన విషయం కావటం బాధిత కుటుంబం మౌనంగా ఉంటోంది. ఏమీ జరగలేదని, విద్యార్థిని ఆరోగ్యంగా ఉన్నట్టు చెబుతున్నట్టు సమాచారం. మరోవైపు ఈ వ్యవహారంలో పెద్దలు సెటిల్‌మెంట్ చేశారని ప్రచారం జరుగుతోంది. విద్యార్థిని మైనర్ కావటంతో తాజాగా ఈవ్యవహారం తహసీల్దారు వద్దకు వెళ్లినట్లు సమాచారం. ఇన్‌చార్జి తహసీల్దారు ఈశ్వరరావు ఈ వ్యవహారంపై రెండు రోజుల కిందట బాధిత కుటుంబ సభ్యులను పిలిపించి విచారణ చేశారని తెలుస్తోంది. ఏమీ కాలేదని, తమను ఇబ్బంది పెట్టద్దని తహసీల్దారు వద్ద వారు కచ్చితంగా చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా విద్యార్థిని గర్భవతి అయిన విషయాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నప్పటికీ ఇది అత్యంత సున్నితమైన సమస్య కావడంతో మెడికల్ గ్రౌండ్ విచారణకు అధికారులు సాహసించడంలేదు. వాస్తవంగా బాధిత విద్యార్థినిని పర్లాకిమిడి ప్రాంతంలో వైద్య పరీక్ష నిర్వహించడంతో గర్భవతి అని తేలినట్లు సమాచారం. ఈ దిశగా విచారణ జరిగితే ఉపాధ్యాయుడి ఘాతుకం బయటపడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఫిర్యాదు లేకపోవటం మెడికల్ టెస్టుకు అవకాశం లేదని ఎస్ఐ నీలావతి అన్నారు. బలవంతంగా ఎవరికీ టెస్టులు చేసే అధికారం లేదన్నారు. ఇది వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన విషయం అని ఎస్ఐ వివరణ ఇచ్చారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

గుర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన కోడి సూర్యకాంతం (52) పురుగు మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజుల కిందట ఇంటి వద్ద పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కొంతకాలంగా సూర్యకాంతం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ బాధను భరించలేక పురుగుల మందు తాగినట్టు తెలుస్తోంది. దీనిపై గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత..

పాచిపెంట, మే 28 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మోసూరులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోసూరు గ్రామానికి చెందిన ఆమిటి వెలంగిణి(19)కి భీమవరానికి చెందిన నిమ్మాది బాబ్జీతో రెండు నెలల కిందట వివాహం జరిగింది. ఆమె ఇటీవల కన్నవారింటికి వచ్చింది. వెలంగిణి రుతుక్రమం సమయంలో తరచూ కడుపు నొప్పితో బాధపడేది. మంగళవారం రాత్రి కూడా కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో కన్నవారి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సీ కృపారావు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్..

సాలూరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఆర్టీసీ డ్రైవర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాలూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాకాలనీకి చెందిన రెడ్డి అప్పలస్వామి(58) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గత కొంతకాలంగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలు వెంటాడటంతో జీవితంపై విరక్తి చెంది ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సాలూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి..

గంట్యాడ, మే28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 25న రాత్రి రామవరం బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం మండలం సారికి గ్రామానికి చెందిన కింతాడ మధు గాయపడ్డాడు. విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధు మృతి చెందారు. ఘటనపై గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

మదుములు ఏర్పాటు చేయరా?

- రైతుల వినతులను పట్టించుకోని పాలకులు
- రోడ్డు నిర్మాణం పూర్తయితే సాగునీటికి కష్టమే





మూసుకున్న మదుము, కోటేశ్వరరావు బంద గట్టుపై నుంచి చేపడుతున్న రోడ్డు నిర్మాణం

గరివిడి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలో రావాడ-దుమ్మెద గ్రామాల మధ్య ఉన్న కోటేశ్వరరావు బందకు మదుములు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రెండు నెలల కిందట దుమ్మెద గ్రామాన్ని కలుపుతూ 1500 మీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ తారురోడ్డు కోటేశ్వరరావు బంద మీదుగా వేయాల్సి ఉంది. పనులు ప్రారంభానికి ముందే మదుములు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానిక రైతులు మొరపెట్టుకున్నారు. అయితే ముదుములు ఏర్పాటు చేయకుండా రోడ్డు పనులు చేపడుతున్నారు. కోటేశ్వరరావు బందకు 1980లో మదుములు ఏర్పాటు చేశారు. అయితే ఈ మదుములు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉంది. దీంతో బంద చేరువన ఉన్నా సాగునీటి కోసం ఎదురు చూసే పరిస్థితి రైతులకు దాపురించే అవకాశం ఉంది. ఇకనైనా పాలకులు స్పందించి కోటేశ్వరరావు బందకు మదుముల ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నెల్లిమర్లలో కలకలం

(మూడో పేజీ తరువాయి)

డిపాజిట్ చెల్లించి చాలా మంది తమ తమ ఇళ్లకు నీటి కుళాయిలు వేయించుకున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలతో పాటు నెల్లిమర్ల నగర పంచాయితీ కౌన్సిల్ తీర్మానం ప్రకారం ఇంటి కనెక్షన్ కోరుకున్న యజమాని డిపాజిట్‌గా 10 వేల రూపాయలు, కుళాయి ఎస్టిమేషన్ చార్జీగా మరో వెయ్యి రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. దీన్ని బట్టి రూ. 11 వేలను చలానా రూపంలో నగర పంచాయతీ అధికారులకు చెల్లించి కనెక్షన్‌లు వేసుకోవాలి.

నిబంధన ఒకలా.. జరిగిందొకలా!

కొద్ది రోజుల క్రితం నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా బదలీపై వచ్చిన తారక్‌నాథ్‌ఇళ్లకు ఇచ్చిన తాగునీటి కనెక్షన్‌లపై దృష్టి సారించారు. దీంతో అసలు రంగు బయటపడింది. డిపాజిట్ సొమ్ము చెల్లించకుండానే కుళాయిలు కలిగి ఉన్నట్లు తేటతెల్లం అయింది. నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల సిబ్బందిని రంగంలోకి దించారు. నీటి కుళాయిలు కలిగి ఉన్న యజమానుల జాబితాలను సిద్ధం చేశారు. డిపాజిట్ కట్టిన వారి వివరాలను కూడా రికార్డుల ఆధారంగా తెలుసుకున్నారు. విచారణలో ఎలాంటి డిపాజిట్ చెల్లించకుండా సుమారు 267 మంది నీటి కుళాయిలు కలిగి ఉన్నారని తెలుసుకుని విస్తుపోయారు. ఈ సంఖ్య 400 వరకు చేరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయా కుళాయిలకు డమ్మీలు వేసి బంద్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ ఇళ్ల యజమానులను కార్యాలయానికి పిలిపించి జూన్ ఒకటి నుంచి వారి నుంచి డిపాజిట్ కట్టించుకోవాలా ? లేదంటే శాశ్వతంగా మూసి వేయాలా అన్న విషయంపై నిర్ణయం తీసుకునేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. గతంలో ఇంటి యజమానులు ఎవరికైనా సొమ్మును నగదు రూపంలో ఇచ్చి ఉంటే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న కోణంలో కూడా ఆలోచన చేస్తున్నట్లు భోగట్టా. ఇప్పటివరకు గుర్తించిన అక్రమ కనెక్షన్‌ల ద్వారా ఐదేళ్ల క్రితమే నగర పంచాయతీ సుమారు రూ.21 లక్షల ఆదాయం కోల్పోయినట్లు స్పష్టమవుతోంది.

అన్నదాతకు ఆసరా

(మూడో పేజీ తరువాయి)

వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండడంతో కేంద్రం పెంచిన మద్దతు ధర రూ.69 ఎటూ చాలదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వరి పంట తగ్గించేందుకు అధికారుల కసరత్తు

రానున్న నాలుగేళ్లలో జిల్లాలో వరి విస్తీర్ణం తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. వరి వల్ల ఆదాయ వనరులు అంతంతమాత్రం కావడంతో ఈసారి ఉద్యాన పంటల వైపు రైతాంగం దృష్టి మళ్లించాలని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఒక వ్యక్తి తలసరి ఆదాయం రాష్ట్రంలో రూ.2లక్షల82వేలు ఉండగా, జిల్లాలో రూ.లక్షా 54 వేలకు పరిమితమైంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో తలసరి ఆదాయం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. జిల్లాలో రైతాంగం 90 శాతం వరి పండిస్తున్నారు. సరాసరి చూస్తే జిల్లాలో ఒక రైతు ఎకరా 20సెంట్ల వరకు వరిని మాత్రమే పండిస్తున్నారు. ఎకరా వరి సాగుపై 25బస్తాల దిగుబడి మూలంగా రూ.45వేలు ఆదాయం రానుంది. అందులో పెట్టుబడులు కింద రూ.25వేలు ఖర్చవుతుంది. అంటే సుమారు రైతుకు రూ.25వేలకు మించి ఆదాయం రావడం లేదు. అందుకే వరిపంటను తగ్గించి ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అరటి, బొప్పాయి, కొబ్బరి, జామ, కోకో, పామాయిల్ తదితర పంటలు పెంచాలంటున్నారు.

ఉద్యాన పంటలతోనే మేలు

ఉద్యాన పంటల సాగుతోనే రైతుకు లాభం. ఆ వైపుగా మారాలని వారికి సూచనలు ఇస్తున్నాం. వాటిపై సబ్సీడీ సైతం ప్రభుత్వం అందించనుంది.

- టీవీ రామారావు, జేసీ, వ్యవసాయశాఖ

పోలాలను ఇచ్చేది లేదు

(మూడో పేజీ తరువాయి)

బయలుదేరారు. విషయం తెలుసుకున్న మారిక గిరిజన యువకులు గ్రామానికి సమీపంలో మార్గమధ్యలో వారిని అడ్డుకున్నారు. కొండదిగి వెంటనే వెళ్లిపోవాలని నినాదాలు చేశారు. గిరిజనులు కొండపైనే బతకగలరని, ప్రకృతి వనరులే తమకు సంపదని, కొండను విడిచిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. చేసేదిలేక అధికారులందరూ వెనక్కివెళ్లిపోయారు. అధికారులను అడ్డుకున్న వారిలో గిరిజన యువకులు జాలారి వీర్రాజు, గమ్మెల బాబూరావు, అప్పలనాయుడు, సోమేష్, శ్రీను, ఆసు వెంకటరావు, గణేష్, దేవుడు, బుజ్జిబాబు తదితరులు ఉన్నారు. అధికారుల్లో తహసీల్దార్ రాములమ్మ, డీటీ సన్యాసినాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, వల్లంపూడి ఎస్‌ఐ, ఏఎస్‌ఐ ఉన్నారు.

సామాజిక ప్రభావ అంచనా సర్వేకు వెళ్లాం

విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మారిక గిరిజన గ్రామాన్ని ఎంపిక చేసింది. అందుకు 213.80 ఎకరాలు అవసరం. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం ముందుగా సామాజిక ప్రభావ అంచనా నివేదికను (ఎస్‌ఐఏ) తయారు చేయాల్సి ఉంది. ఇందుకోసం బుధవారం గ్రామానికి వెళ్లాం. వారితో మాట్లాడాం. నూతన భూ సేకరణ చట్టం గురించి వివరించి సర్వేకు సహకరించాలని కోరాం. రైతులు, గ్రామ పెద్దలు, నిర్వాసితులు ఎస్‌ఐఏ టీమ్ సభ్యులను, రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు.

- పి.దేవరాజు,ఎస్ఐఏ నిపుణుడు, అధికారుల బృంద సభ్యుడు

వేగంగా వంతెన నిర్మాణం

(మూడో పేజీ తరువాయి)

అయ్యాయి. నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కాంతిమతికి కలెక్టర్ అంబేడ్కర్ అప్పగించారు. ఇప్పటివరకు 87శాతం పనులు పూర్తి అయ్యాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

కౌలురైతుల సదస్సులను వినియోగించుకోండి

బాడంగి, మే 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 2 వరకు నిర్వహించనున్న కౌలు రైతుల సదస్సులు వినియోగించుకోవాలని మండల వ్యవ సాయ అధికారిణి కె.శిరీష తెలిపారు. మండ లంలోని రేజేరు, ఆనవరం రైతు సేవా కేంద్రా ల్లో బుధవారం ఆమె కౌలురైతులతో సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులంతా తప్పనిసరిగా వీఆర్వోలను సంప్రదించి కౌలు పత్రం పొందాలని సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలు పొందాలని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నుల పెంపు దుర్మార్గం

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్నులు పెంచడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు అన్నారు. ఈ మేరకు బొబ్బిలిలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన తోపాటు సీపీఎం బొబ్బిలి పట్టణ కన్వీనర్ పి.శంకరరావు మాట్లాడారు. ఇంటి పన్ను పెంపు కోసం రాష్ట్రంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే ద్వారా ప్రజలపై 1,500 కోట్లు భారం వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. చట్ట విరుద్ధమైన ఆస్తి విలువల ఆధారిత పన్ను విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కన్వీనర్ సింగిరెడ్డి గోపాల్, సభ్యులు జి.శంకరరావు, బి.వెంకటరమణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాలకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాలనీని ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో 1100 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో గృహాలు నిర్మించడంకోవడం లేదని 45 గృహాల్లో మాత్రమే నివాసం ఉంటున్నారన్నారు. నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు స్పందించి వీధి లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలన్నారు. బోర్లు వేసి నీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సీపీఐ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

- పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో అడుగడుగునా గోతులు
- నిధులు కేటాయించినా పనులు ప్రారంభించని వైనం



కోటవానివలస సమీపంలో గోతులమయంగా ఉన్న రహదారి

గరుగుబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి గోతులమయంగా తయారయ్యింది. కోటవానివలస నుంచి పార్వతీపురం సమీపంలోని కొత్తవలస వరకు ఉన్న ప్రధాన రహదారిలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి మరింత అధ్వానంగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడ్డాపుశీల ప్రాంతం వరకు రహదారిని మెరుగుపర్చారు. ఖడ్గవలస సముదాయం నుంచి ఉల్లిభద్ర కుడి ప్రధాన కాలువ ప్రాంతం వరకు ఉన్న రహదారికి సుమారు రూ.1.50 కోట్లు వ్యయం చేసి బీటీ రహదారి నిర్మించారు. అయితే అడ్డాపుశీల నుంచి కొత్తవలస ప్రధాన రహదారికి రూ.40లక్షల నిధులు కేటాయించారు. అయితే ఇంకా రహదారి పనులు ప్రారంభించకపో వడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదభరితంగా తయారయ్యింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారిని మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాలు

గరుగుబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో జి.పైడితల్లి, కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి.సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్‌వీ కూర్మినాయుడు, ఆయూష్ వైద్యాధికారి కాసులవర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో మండల, గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు పాల్గొని, యోగా గురువు సమక్షంలో యోగా చేశారు. డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. ● బాడంగి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు. ● భామిని: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి సోయల్ అన్నారు. యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ బుధవారం స్థానిక ఎమ్మార్సీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ యోగ చేయండి.. ఆరోగ్యంగా జీవించండని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం బంధం వారి వీధిలో యోగాసనాలు వేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ● మక్కువ: స్థానిక సచివాలయంలో బుధవారం విద్యా ర్థులకు యోగా ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి.దేవకుమార్ ఆధ్వర్యంలో యోగా విద్యపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: యోగా చేస్తున్న ఉద్యోగులు, పట్టణవాసులు



యోగా చేస్తున్న ఆర్డీవో రామమోహనరావు, అధికారులు

వన్‌బీకి ఆధార్ లింక్ తప్పనిసరి

రామభద్రపురం, మే 28(ఆంధ్రజ్యోతి): రైతుల వన్‌బీ ఖాతాకు ఆధార్ లింక్ ఉంటేనే అన్నదాత సుఖీభవ నిధులు జమ అవుతాయని తహసీల్దార్ ఎ.సులోచనారాణి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అర్హులు సచివాలయానికి వెళ్లి ఆధార్ అప్డేట్ చేసుకోవాలన్నారు. డీటీ గంగాధరరావు పాల్గొన్నారు. ● తెర్లాం: అన్నదాత సుఖీభవ పథకం వర్తించేందుకు రైతులు తమ భూమి ఖాతాకు ఆధార్‌నెంబరు లింక్ చేసుకోవాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రైతులు తమ గ్రామ పరిధిలో ఉన్న సచివాలయాల్లో ఆధార్ లింక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

రామభద్రపురం, మే 28(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ పి.అప్పయ్య కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏఈ వెంకటేష్‌తో కలిసి ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 12వ తేదీలోపు గృహ ప్రవేశాలు చేసేలా ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పీఎం ఈఏవైయూ పథకం కింద మంజూరై డిసెంబరులోగా నిర్మాణాలు చేపట్టని ఇళ్లు రద్దవుతాయని తెలిపారు. నియోజకవర్గంలో సొంత స్థలాలు ఉన్నవారికి లేఅవుట్‌లలో ఉన్న మొత్తం 1,888 ఇంటి నిర్మాణాలు లక్ష్యంగా ఇప్పటి వరకు 595 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగతావి నత్తనడకన సాగుతున్నాయని, వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కోసం 1,973 దరఖాస్తులు వచ్చాయని, వాటికి రెవెన్యూ అధికారుల నుంచి పొజిషన్ సర్టిఫికేట్ ఉంటేనే మంజూరవుతాయన్నారు.

విద్యాశాఖ కార్యాలయంలో ఆడిట్

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయులకు మంజూరు చేసిన నిధులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్స రానికిగాను విడుదలైన నిధులు ఎంత మేరకు వెచ్చించారు, అందుకు సం బంధించిన బిల్లులను ఆడిట్ అధికారి నితీష్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలిం చారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, దత్తిరేజేరు, మెంటాడ, వేపాడ తదితర మండలాలకు చెందిన 120 పాఠశాలల హెచ్‌ఎంల సమక్షంలో ఆడిట్ చేశారు. ఆయా హెచ్‌ఎంలు ఇచ్చిన పత్రాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ, చాక్‌పీస్‌లు, చార్టులకు, విద్యుత్, చిన్నపాటి మరమ్మతులు, జాతీయ పండుగలు తదితరాలకు ఖర్చులపై బిల్లులు, దస్త్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు, వాసుదేవరావు, సిబ్బంది పాల్గొని ఆడిట్ అధికారులకు సహకరించారు.

బెవర అన్నదాన సత్రానికి వందేళ్లు



గోపాలనాయుడు, వేణుగోపాలనాయుడు విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదునూరువారివీధిలో బెవర గోపాలనాయుడు అన్నదాన సత్రం నేటికి వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ మేరకు గోపాలనాయుడు, ఆయన కొడుకు వేణుగోపాల స్వామినాయుడి విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. కుటుంబ సభ్యులు డా.పాలవలస శశిభూషణరావు, పాలవలస కరుణాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ విగ్రహాలను ముని మనుమరాలు స్వర్ణశ్రీ, సీనియర్ ఐఏఎస్ ఎస్.సత్యనారాయణ దంపతులు సమకూర్చారు. శశిభూషణరావు మాట్లాడుతూ ఈ అన్నదాన సత్రాన్ని 1924లో ప్రారంభించారని చెప్పారు. సుమారు 70 ఎకరాలు దేవదాయశాఖకు అందజేశారు. వీటి ద్వారా వచ్చిన ఆదాయంతో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్, కోటదుర్గమ్మ ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరపై రైతుల అసంతృప్తి

పార్వతీపురం/ పాలకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరపై రైతులు అసంతృప్తిగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పంటల మద్దతు ధరలో భాగంగా వరికి రూ.69లు పెంచి భారీగా పెంచామని చెప్పుకోవడం బాధాకరమన్నారు. 2025-26కు ఖరీఫ్ సీజన్‌కుగాను కేంద్ర మంత్రివర్గం రూ.2,369 ధరను నిర్ణయించిందని తెలిపారు. 2010-11 నుంచి వ్యవసాయ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున ధరలు పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడం అనేది మోసం అన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పునః సమీక్షించాలని ఆయన కోరారు. లేదంటే జూలై 9వ తేదీ నుంచి జరిగే దేశవ్యాప్త బంద్‌కు క్షేత్రస్థాయి నుంచి మద్దతు తెలుపుతామన్నారు.

సాగు పట్టాలు ఇవ్వండి

- గిరిజనుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన గిరిజనులు

పాచిపెంట, మే 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న కుడుమూరు రెవెన్యూ భూములకు పట్టాలు మంజూరు చేయాలంటూ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. ముందుగా పలు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. బైఠాయించిన అనంతరం తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని కుడుమూరు రెవెన్యూ సర్వే నెంబరు 48లో 782 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూముల్లో గొట్టూరు పంచాయతీ తోకమెట్ట, మెట్టవలస, ఒడిసలమడ, ఇప్పలవలస, వేలుగానివలస, కుడుమూరు, తదితర 14 గ్రామాలకు చెందిన 300లకు పైగా గిరిజన కుటుంబాలు తరతరాలుగా సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పలుమార్లు పోరాటాలు చేసిన మేరకు సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా అధికారులు నిర్ధారించారని తెలిపారు. అయితే గిరిజనులకు చెందకుండా అన్యాక్రాంతం చేయడానికి కొంతమంది పెద్దలు వెనుకాడలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు మంచాల శ్రీనివాసరావు, జన్ని రామయ్య, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో రైతులకు ఇక్కట్లు



మొక్కజొన్న పంటపై కప్పిన టార్పాలిన్లు

భామిని, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచే చిరుజల్లులకు కురవడంతో రైతులకు ఇక్కట్లు తప్పలేదు. రబీలో సాగు చేసి, సేకరించిన మొక్కజొన్న, ధాన్యాన్ని ఆరుబయటే నిల్వ చేస్తున్న రైతులు ప్రతిరోజూ చిరుజ ల్లులు పడడంతో అవస్థలు పడుతున్నారు. భామిని, లివిరి, దిమ్మిడిజోల, కీసర, కోసలి తదితర గ్రామాల్లో మొక్కజొన్న, ధాన్యం పంటలపై టార్పాలిన్లు కప్పిఉంచారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి సింగారపు వీధిలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను గురువారం నుంచి నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించి కరపత్రికను బుధవారం విడుదల చేశారు.

నేడు మండల సమావేశం

గరుగుబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ జయంతిలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం పక్కి గ్రామంలో ఆయన విగ్రహానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బాడంగి, మే 28(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి 20 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ బి.రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

పాచిపెంట, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం పాంచాళి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సీడీపీవో బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ బాలికలు, మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు రాకుండా, రక్తహీనతకు గురికాకుండా తీసు కోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పార్వతి, ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ

సాలూరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాలూరులో ఉన్న మూడు సినిమా థియేటర్లను తహసీల్దార్ ఎన్వీ రమణ బుధవారం తనిఖీ చేశారు. అయితే ఆయన తనిఖీ సమయంలో ఉదయం ఆటను థియేటర్లలో ఏ కారణంచేతనో ప్రదర్శించలేదు. దీంతో అగ్నిమాపక ఏర్పాట్లు, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. పూర్తి పరిశీలనను వాయిదా వేశారు. గురువారం మళ్లీ పరిశీలనకు వెళ్లనున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని బ్రహ్మకుమారీస్ సంస్థ నియోజకవర్గ ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి అక్కయ్య అన్నారు. వచ్చే నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బొబ్బిలిలోని యుద్ధస్తంభం ఎదురుగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

బొబ్బిలి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని గొడువీధి, రత్నాల నగర్, మేదరబంద, ఓంకార్ థియేటర్ రోడ్డు, జయ ప్రకాష్ పాఠశాల రోడ్డు, బలిజిపేట రోడ్డు, టీబీఆర్ థియేటర్ ప్రాంతాలను ఆమె బుధవారం పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళికి ఆదేశించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.